

కొండపోచమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.4.36 లక్షలు

జగదేవ్‌పూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. 91 రోజులకు గాను హుండీ ద్వారా రూ.4,36,088 నగదు సమకూరినట్లు ఆలయాధికారి తెలిపారు. కానుకలు రూపంలో వచ్చిన ఆదాయంను ఆలయ ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.





కోతికి ₹250

ఒక్కో కోతికి రూ.250 చెల్లించి మరీ పట్టించారు ఆ గ్రామస్థులు. వానరాల గుంపు పెడుతున్న అవస్థలు అలాంటివి. పంటలకు నాశనం చేయడం, ఇళ్లల్లోకి చొరబడడం, ఇంటిపైన పెంకుల కప్పులకు దెబ్బతినడం... ఇలా ఒకటేమిటి, ఆఖరికి మనుషులను కూడా కరుస్తున్నాయి. అటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొండపాక మండలంలోని బందారం గ్రామస్థులంతా ఏకమయ్యారు. గ్రామ పెద్దలు ఒక్కో ఇంటి నుంచి రూ.500 వసూలు చేసి ఒక్కో కోతికి రూ.250 చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుని కోతులు పట్టే వారిని రప్పించారు. వారు ఇప్పటివరకు 350 వరకు కోతులను పట్టుకున్నారు. వాటిని దూరప్రాంతంలోని అడవిలో వదలనున్నారు.

- కొండపాక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి)

కంది గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్నవారికి

అనుకూల పరిహారం ఇవ్వాలన్న జగ్గారెడ్డి

- వందేళ్ల క్రితం నుంచే కందిలో వారి ఇళ్లు, స్థలాలు ఉన్నాయి
- మానవతా దృక్పథంతో వ్యవహరించి న్యాయం చేయాలని మీడియా ద్వారా కలెక్టర్‌ను కోరిన జగ్గారెడ్డి
- నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులకు స్వయంగా పరిస్థితులపై అవగాహన
- ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదు.. ఉంటే సీఎంతో మాట్లాడేవాడిని
- ఇది ప్రధాని, కేంద్ర మంత్రులు, ఎంపీల పరిధిలో ఉంది
- కంది నిర్వాసితులు నా దగ్గరకు వచ్చినందునే అధికారులనే గ్రామానికి తీసుకొచ్చానన్న జగ్గారెడ్డి
- 1956 భూచట్టానికి ముందే ఇక్కడ ఇళ్లు, స్థలాలున్నాయి

సంగారెడ్డి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ముంబయి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కంది గ్రామంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు జగ్గారెడ్డి బాసటగా నిలిచారు. విషయాన్ని ఆయన దృష్టికి తేవడంతో నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులను కంది గ్రామానికి తీసుకొచ్చారు. ఇక్కడి పరిస్థితులపై అధికారులకు అవగాహన కల్పించారు. వందేళ్ల క్రితం నుంచే ఉంటున్న నిర్మాణాలను ఎలా తొలగిస్తారని, ఒకవేళ తొలగించాల్సి వస్తే అనుకూలమైన మంచి పరిహారం ఇవ్వాలన్నారు. ఈమేరకు మీడియా ద్వారా కలెక్టర్‌ను కోరారు. వారికి న్యాయం జరిగేదాకా అండగా ఉంటానన్నారు.



కంది గ్రామంలో జాతీయ రహదారి విస్తరణ నిర్వాసితుల సమస్యలను అధికారులకు వివరిస్తున్న జగ్గారెడ్డి

సూసైడ్‌స్పాట్‌గా మంజీర
నెలా పది రోజుల్లో నదిలో దూకిన ముగ్గురు.. ఇద్దరి ఆచూకీ గల్లంతు
వంతెన వద్ద రక్షణ చర్యలు కరువు 7
పట్టించుకోని ఎన్‌హెచ్ఏఐ, పోలీసు అధికారులు

నైపుణ్యాభివృద్ధి దిశగా ప్రభుత్వ పాఠశాలలు
విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి 8

బాలికపై లైంగిక వేధింపులు
పోక్సో కేసు నమోదు 6

ముక్కు మూసుకోవాల్సిందే
ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా చెత్తాచెదారం 8



స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌కు బ్రేక్ పడిన మరుక్షణమే అందరి దృష్టి వైన్‌షాపులపైకి మళ్లింది. బరిలో నిలవాలనుకున్న ఆశావహులతోపాటు మద్యం వ్యాపారులు, కొత్త వ్యక్తులు సైతం పునరాలోచనలో పడ్డారు. ఎలాగూ ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేకపోవడంతో వైన్‌షాపులను దక్కించుకోవడానికి సిద్ధమవుతున్నారు. కొత్త షాపులు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తున్నందున ఆ తర్వాతనే పల్లె, పట్టణాల ఎన్నికలు జరుగుతాయనే అంచనా ఉండడమే ప్రధాన కారణం. ఎన్నికల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగితే లాభాన్ని మూటగట్టుకోవచ్చని లెక్కలు వేస్తున్నారు.

ఇక వైన్స్ టెండర్లకు సై

స్థానిక ఎన్నికలకు బ్రేక్.. దరఖాస్తులకు ఊపు

- మద్యం దుకాణాలపైకి మళ్లిన దృష్టి
- శుక్రవారం ఒక్కరోజే 87 దరఖాస్తులు
- కొత్త వైన్‌షాపుల హయాంలోనే ఎలక్షన్‌లు
- భారీగా మద్యం విక్రయాలపై అంచనా
- రూ. 3 లక్షల ఫీజుకు రెడీ అంటున్న వైనం
- షాపుల బరిలోకి 'స్థానిక' ఆశావహులు

సంగారెడ్డి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :రెండేళ్ల క్రితం జరిగిన మద్యం దుకాణాల కేటాయింపులో దరఖాస్తులు ఎక్కువగా వచ్చిన జిల్లాల్లో సంగారెడ్డి జిల్లా ముందువరుసలో ఉంది. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల ఫీజు నిర్ణయించినప్పటికీ వెనక్కు తగ్గలేదు. నాడు సంగారెడ్డి జిల్లాలో 101 వైన్‌షాపులకు 6,156 దరఖాస్తులు, సిద్దిపేటలో 93 షాపులకు 4,166, మెదక్ జిల్లాలో 49 షాపులకు 1,905 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా కనిపిస్తున్నది. ఇప్పటివరకు నత్తనడకన సాగిన దరఖాస్తులు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నాయి.

పల్లె, పట్టణ ఎన్నికలపై ఆశలు..

తాజాగా హైకోర్టు తీర్పుతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ప్రభుత్వానికి నాలుగు వారాల పాటు గడువు విధించడం, ఆ తర్వాత రెండు వారాల పాటు పిటిషనర్లకు గడువు ఇచ్చినందున మరో 45 రోజుల దాకా ఎన్నికల ప్రస్తావన ఉండకపోవచ్చు. ఈ లెక్కన నవంబరు నెలాఖరు వరకే ఎన్నికలపై స్పష్టత వస్తుంది. అప్పటికప్పుడు నోటిఫికేషన్ విడుదలైనా డిసెంబరు లేదా జనవరిలో స్థానిక, పంచాయతీ ఎన్నికలు ఉంటాయి. ఆ తర్వాత మున్సిపల్

మిగతా 7వ పేజీలో

దరఖాస్తుల వివరాలు

జిల్లా	వైన్స్‌లు	దరఖాస్తులు(14రోజుల్లో)	శుక్రవారం
మెదక్	49	25	26
సంగారెడ్డి	101	133	53
సిద్దిపేట	93	44	8

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ హైమావతి



విద్యార్థులను పలకరిస్తున్న కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్/హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తయ్యేలా చూడాలని, లబ్ధిదారులకు బిల్లులను పెండింగ్‌లో పెట్టొద్దని కలెక్టర్ హైమావతి సూచించారు. శుక్రవారం ఆమె హుస్నాబాద్ మున్సిపల్ సమావేశ మందిరంలో డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట, ఎల్కతుర్తి నేషనల్ హైవే పనుల్లో వేగం పెంచాలన్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి ఫోర్‌లైన్ రహదారి నిర్మాణంలో ఎలక్ట్రికల్ లైన్ షిఫ్టింగ్, ట్రీ కటింగ్ పనులను తొందరగా చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలో గ్రామపంచాయతీ భవనాలు మంజూరైన పొట్లపల్లి, భల్లునాయక్ తండా, మహ్మదాపూర్, మీర్జాపూర్, బంజెరుపల్లిలలో నిర్మాణాలకు స్థలాన్ని సేకరించి ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలన్నారు. అలాగే యాసంగి విత్తనాల పంపిణీ ప్రక్రియ వచ్చే నెల నుంచి మొదలు పెట్టాలన్నారు. దీనికి ముందు హుస్నాబాద్ పట్టణంలోని బస్తీ దవాఖానాను తనిఖీ చేశారు. పందిల్ల స్టేజీ వద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న వంటలను పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులున్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు 7

పల్లెపహాడ్‌కు చెందిన రమ్యమహిపాల్‌ను ప్రసూతి కోసం గత నెలలో అర్ధరాత్రి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు నిర్లక్ష్యంతో ఆలస్యంగా సర్జరీ చేయగా, ఆడ శిశువుకు జన్మనిచ్చింది. శిశువును రెండు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి, ఆ తరువాత పరిస్థితి విషమంగా ఉందని, నీలోఫర్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. వెంటనే సికింద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి చేర్చి చికిత్స అందించారు. శిశువు ఉమ్మనీరు (లైకర్) మింగడంతో మెదడు చేరి, మృతిచెందింది. బిడ్డ పుట్టిన వెంటనే అసలు సమస్య చెప్పి ఉంటే దక్కించుకునేవారమని కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన శ్యామలకు రక్తశాతం తక్కువగా ఉందని, తల్లిబిడ్డకు ప్రమాదమని నీలోఫర్‌కు తీసుకెళ్లాని వైద్యులు చెప్పారు. ఆసుపత్రి డ్యూటీ డాక్టరే స్వయంగా శ్యామల భర్త ఫోన్ నుంచి అంబులెన్స్‌కు ఫోన్ చేసి పంపించారు. అయితే, నీలోఫర్‌కు వెళ్లినప్పుడు అక్కడి వైద్యులు తమ వద్దకు ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఈ విషయమై శ్యామల భర్త రాతపూర్వకంగా సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

కుకునూరుపల్లికి చెందిన పద్మభరణి రెండో డెలివరీకి గత నెల గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఆమెకు ప్లజెంటా బ్లీడింగ్ అవుతోందని, తమ వద్ద స్టాఫ్ లేరనే కారణంతో సిద్దిపేటకు రిఫర్ చేశారు. సిద్దిపేట ఆసుపత్రికి వెళ్తే, అక్కడి డాక్టర్లు ఇక్కడిదాకా ఎందుకు వచ్చారని ప్రశ్నించి, ఆమెకు సర్జరీ చేశారు.

ఈ మూడు ఘటనలు గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న నిర్లక్ష్యపు వైద్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ప్రసవాలకు పేరుగాంచిన గజ్వేల్ జిల్లా ఆసుపత్రి ప్రస్తుతం తీవ్ర గందరగోళం, నాణ్యత లోపించిన వైద్య సేవలతో మసకబారుతోంది. వైద్య సేవల్లో నిర్లక్ష్యం పట్ల రోగులు, వారి తరఫున వచ్చే వారి నుంచి అసహనం వెల్లువెత్తుతున్నది.



ఇదేమి రోగం!

- జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలపై నిర్లక్ష్యం
- వైద్యుల మధ్య అంతర్గత విభేదాలు
- పెరిగిన రిఫరల్ దందా.. కమీషన్‌కి కక్కుర్తి
- ఆసుపత్రిలో ప్రైవేటు ల్యాబ్‌ల సిబ్బంది
- క్లీనర్ల నియామకంలో అక్రమాలు?

గజ్వేల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీతో పాటు అనుబంధంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా సేవలందిస్తుండడంతో గజ్వేల్‌లో ఉన్న ఏరియా ఆసుపత్రిని గత సర్కారు హయాంలో జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. అంతేకాకుండా అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో తీర్చిదిద్దారు. తొలుత మెరుగైన వైద్య సేవలందగా, చుట్టుపక్కల ఉన్న ఐదు నియోజకవర్గాలకు చెందిన వారు ఇక్కడికే రావడం ప్రారంభించారు. అదంతా గతం. ఇటీవల ఆసుపత్రికి నిర్లక్ష్యపు రోగం అంటుకున్నది. వైద్య సేవలు దిగజారడంతో రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఎవరికి వారే యమునా తీరే

ఆసుపత్రిలో ప్రధానంగా వైద్యుల మధ్య సమన్వయం కొరవడింది. సూపరింటెండెంట్‌కు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా వైద్యులు చీలిపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా పరిస్థితి మారింది. ఈ అంతర్గత విభేదాల కారణంగా సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు వైద్యులు తమ రాజకీయ, అధికార పలుకుబడితో సూపరింటెండెంట్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఆసుపత్రిలో డిప్యూటేషన్లను రద్దు చేయించిన సూపరింటెండెంట్‌పై పలువురు సిబ్బంది కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తున్నది. ఓ కీలక అధికారి, ఆయన భార్య గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో తిష్ఠవేసి ఆస్పత్రి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రిఫరల్ దందా

గజ్వేల్ ఆసుపత్రిలో రిఫరల్ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. డెలివరీ, ఇతర వైద్య పరీక్షల కోసం వచ్చే రోగులను ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు రిఫర్ చేస్తూ కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రైవేటు డయాగ్నోస్టిక్

మిగతా 8లో

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

దుబ్బాక పట్టణంలో శుక్రవారం బొడ్రాయి(నాభిశిల భూలక్ష్మి) అమ్మవారి పునః ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. మాధవానంద సరస్వతిస్వామి యంత్రస్పర్శన, జపోధన వంటి పవిత్ర కర్మలను నిర్వహించి, భక్తులకు అనుగ్రహమిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, బీఆర్ఎస్ నాయకురాలు కత్తి కార్తీక, తదితరులు పాల్గొన్నారు.

-దుబ్బాక, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి)



రెట్టింపు భక్తులకు అన్నదానం

- ప్రతిరోజూ 200, ఆదివారం 400 మంది భక్తులకు ప్రసాదం అందించేందుకు ప్రతిపాదనలు
- ఉన్నతాధికారుల ఆమోదం కోసం ఎదురుచూపు

కొమురవెల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ నిత్యాన్నదాన సత్రం కడుపు నింపుతోంది. ప్రస్తుతం ప్రతిరోజూ 100 మంది భక్తులకు, ఆదివారం రోజు 200 మంది భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని వితరణ చేస్తున్నారు. దాతలు అందించిన నిధులతో పాటు ఆలయ నిధులను వెచ్చించి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. దీనిని రెట్టింపు చేసేందుకు ఆలయాధికారులు ప్రయత్నిస్తున్నారు.

ప్రతిపాదనలు

అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆలయాధికారులు అన్నప్రసాదాన్ని అందించే భక్తుల సంఖ్యను పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో 200 మందికి, ఆదివారం 400 మందికి అన్నప్రసాదాన్ని అందించేలా అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆలయాధికారులు ఇటీవల దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఉన్నతాధికారుల ఆమోదం లభిస్తే, మరింత మంది భక్తులకు నిత్యాన్నదాన సత్రం ద్వారా అన్నప్రసాదం లభించే అవకాశం ఉంటుంది.



కొమురవెల్లిలోని నిత్యాన్నదాన సత్రం

దాతల సహకారం కీలకం

నిత్యాన్నదాన సత్రానికి పలువురు భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 120మంది దాతలు రూ.లక్ష (మహారాజ పోషకులుగా), రూ.50,000(రాజ పోషకులుగా) చొప్పున విరాళాలు అందించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులకు అన్నదానం చేయాలంటే, మరింత మంది దాతలు ముందుకు రావాలని ఆలయాధికారులు కోరుతున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేశ్ స్పందిస్తూ భవిష్యత్తులో ఇంకా ఎక్కువ భక్తులకు అన్నప్రసాదాన్ని అందించే విధంగా ప్రతిపాదనలు పంపించామని, ఉన్నతాధికారుల సూచనల మేరకు ముందుకు వెళ్తామని తెలిపారు.

వారంపాటు 32 రైళ్లు రద్దు

- వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్
- గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..
- డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతు పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు ఈ నెల 11 నుంచి 18 వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ -డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ, విశాఖపట్నం-న్యూఢిల్లీ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్-తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం-సికింద్రాబాద్ వందేభారత్, సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయల్దేరుతుంది.

శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేంద్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జతసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్‌మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.



దొంగతనం జరిగినతీరుపై ఆరాతీస్తున్న సీఐ శివలింగం

ఆలయంలో హుండీ ధ్వంసం

- నగదు, ఆభరణాల అపహరణ

జహీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని భవానమ్మపల్లిలో గల భవానిమాత ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి హుండీని ధ్వంసం చేసి నగదును అపహరించారు. దసరా నవరాత్రులు ముగియడంతో ఉత్సవ కమిటీ సభ్యులు ఇంకా హుండీ ఆదాయాన్ని లెక్కించలేదని స్థానికులు, పోలీసులు తెలిపారు. ఆలయంలో మూడు హుండీలు ఉండగా, దోపిడీ దొంగలు ఒక హుండీని ఎత్తుకెళ్లారు, మరొక హుండీని అక్కడే పగులగొట్టారు. ఇంకో హుండీ తీయడానికి వీలుకాకపోవడంతో అక్కడే వదిలేసి పోయారు. దీనితో పాటు అమ్మవారి నగలు, ఇతర వస్తువులను కూడా దొంగిలించినట్లు వారు వివరించారు. లెక్కిస్తే దాదాపు రూ.3లక్షల వరకు ఆదాయం ఉన్న హుండీని బట్టి చూస్తే, మిగతా రెండు హుండీలలో సుమారు రూ.2 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. వీటితో పాటు వెండితో తయారు చేసిన అమ్మవారి కిరీటం, శఠగోపాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలానికి జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, క్లూస్ టీం సిబ్బంది చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదని, త్వరలోనే పట్టుకుంటామని పట్టణ సీఐ శివలింగం, ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత



పట్టుకున్న బియ్యం లారీ

కల్హేర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి రాజస్థాన్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకుని నారాయణఖేడ్ పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు కల్హేర్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి తమ సిబ్బందితో కలిసి మాసానపల్లి చౌరస్తా సమీపంలో 161 వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా, జీజే 03 బీవీ 2177 నంబరు గల లారీలో బియ్యం బస్తాలను గుర్తించారు. తరలిస్తున్న బియ్యం బస్తాలు ఒకే సైజులో లేకపోవడం, రవాణాకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో అనుమానంతో లారీని పట్టుకున్నారు. లారీని నారాయణఖేడ్ పౌరసరఫరాల శాఖ గోదాముకు తరలించగా, అక్కడ స్థలం లేకపోవడంతో సదాశివపేట గోదాముకు తరలించారు. లారీలో సుమారు 450 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించామని, లోడును ఖాళీ చేయించి లారీని సీజ్ చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిజాంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండల కేంద్రంలోని మల్కచెరువులో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడికి సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. మృతుడు చామన చాయ రంగులో ఉండి, నీలి రంగు ప్యాంటు, నలుపు రంగు డ్రాయర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఎడమ చేతిపై సూర్యుడు బొమ్మను పోలిన పచ్చ బొట్టు ఉన్నందని, ఎవరైనా గుర్తిస్తే నిజాంపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీ యజమానిపై కేసు



శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై అధికారులు, వెల్దుర్తి పోలీసులు

వెల్దుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో అక్రమంగా నిల్వ ఉంచిన, అశోక్ లేలాండ్ వాహనం నుంచి కంపెనీలో అన్‌లోడ్ చేస్తున్న రేషన్ బియ్యాన్ని మెదక్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది గురువారం రాత్రి సీజ్ చేశారు. సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, స్థానిక ఎస్ఐ రాజు సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం పరిశీలించి, బియ్యం బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. ఈ మేరకు శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీ యజమానిపై కేసు నమోదుతో పాటు, రేషన్ బియ్యం తరలింపుకు వాడిన వాహనాన్ని కూడా సీజ్ చేశారు. పట్టుబడిన 35.42 క్వింటాల రేషన్ బియ్యాన్ని వెల్దుర్తిలోని శివసాయి రైస్‌మిల్లుకు తరలించారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని, రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ రాజు సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై జూనియర్ అధికారులు నాగరాజు, గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి యువకుడి మృతి



సిలిండర్‌కు అంటుకున్న మంటలు

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాస్ సిలిండర్ పేలి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం... భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్ఐజీ కాలనీలో నివాసం ఉంటున్న భాస్కర్ ఇంట్లో గురువారం రాత్రి గ్యాస్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌ను అమరుస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పడానికి భాస్కర్ కుమారుడు ఆనంద్ స్వరూప్ (22) ప్రయత్నించగా, సిలిండర్ ఒక్కసారిగా పేలింది. గోడ కూలి ఆనంద్ స్వరూప్‌పై పడటంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆనంద్ స్వరూప్(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడు..

మిరుదొడ్డి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో జరిగింది. ఎస్సై హరీష్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొల్లి రాజు (29) అనే యువకుడు ఈ నెల 6న ఇంట్లో గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున రాజు మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య కీర్తన, సంవత్సరన్నర కొడుకు ఉన్నారు. రాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి..

చేగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన పెట్రోల్ పంపు వద్ద మృతి చెందిన ఘటన చేగుంట మండలం బోనాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు చేగుంట పోలీసులు మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు. మృతుడి వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు చైన్ స్నాచర్ల అరెస్ట్

- నిందితుల్లో ఒకరు సంగారెడ్డి, మరొకరు మెదక్ జిల్లావాసులు

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బు సంపాదించాలని ఒకరు.. ఇంటి కోసం చేసిన అప్పు కిస్తీ కట్టాలని మరొకరు ఇలా సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన ఇద్దరు.. వికారాబాద్‌కు చెందిన మరొకరు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. వారిని నగరంలోని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి ఏడు తులాల బంగారం, రెండు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, మేడ్చల్, పేట్‌బషీరాబాద్ ఏసీపీలు శంకర్‌రెడ్డి బాలగంగిరెడ్డిలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా అన్నారం గ్రామానికి చెందిన మస్కూర్ అరుణ్‌కుమార్ ఇల్లు కట్టుకునేందుకు అప్పు తీసుకున్నాడు. కిస్తీలు కట్టేందుకు డబ్బులు లేకపోవడంతో చైన్ స్నాచింగ్‌లు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 3న మెదక్ జిల్లా మద్దూరుకు చెందిన ఇందిర జీడిమెట్ల డిపో వద్ద బస్సు దిగి సూరారం వైపు వెళ్తుండగా, బైక్‌పై వెనుక నుంచి వచ్చిన అరుణ్‌కుమార్ ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు తెంపుకుని పోయాడు. మెదక్ జిల్లా వెల్దుర్తికి చెందిన నేరేడు భూమయ్య (21) పాత నేరస్తుడు. డెలివరీబాయ్‌గా పని చేస్తూ చింతల్‌లో ఉంటాడు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌కు చెందిన మనుశ్రీ ఈ నెల 7న నారాయణాద్రి లే-అవుట్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా, నడుచుకుంటూ వచ్చిన భూమయ్య ఆమె మెడలో ఉన్న 25 గ్రాముల బంగారు పుస్తెల తాడు తెంపుకుని పోయాడు. అలాగే, వికారాబాద్ జిల్లాకు చెందిన తూళ్ల నీరంజన్‌రెడ్డి డెలివరీ బాయ్‌గా పని చేస్తూ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. ఈ నెల 7న అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధి సిద్ధి వినాయక నగర్, మచ్చ బొల్లారానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు తెంపుకుని వెళ్లాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశారు.

టేక్మాల్ పరిధిలో ఇద్దరు..

టేక్మాల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బంగారు గొలుసు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టేక్మాల్ ఎస్సై రాజేష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 3న సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచిపల్లి గ్రామానికి చెందిన లొద్ది రుక్మిణి పెద్ద శంకరంపేటలోని తన కుమార్తె వద్దకు వెళ్లేందుకు బస్ స్టాండ్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన ఆటో ఎక్కింది. ఆ ఆటోలో డ్రైవర్‌తో పాటు ఒక మహిళ కూడా ఉన్నారు. శంకరంపేట వద్ద ఆపకుండా టేక్మాల్ మండలం బొడ్మాట్‌పల్లి వద్ద ఉన్న గుట్ట పక్కన ఉన్న పాఠశాల వద్ద ఆపి, రుక్మిణి కళ్లలో స్ప్రే కొట్టి ఆమె మెడలో ఉన్న తులం బంగారు గొలుసును అపహరించుకొని వెళ్లారు. రుక్మిణి ఫిర్యాదు మేరకు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల సహాయంతో సంగారెడ్డిలో ఉన్న కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం రత్నపూర్ గ్రామానికి చెందిన పూజారి శ్రీధర్, పూజారి శిరీష అనే భార్యాభర్తలను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు వారు ఒప్పుకున్నారు. వారిని మెదక్ కోర్టులో హాజరుపరచగా, శిక్ష విధించి సంగారెడ్డి జిల్లా కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిని..

మద్దూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు జిల్లాలకు చెందిన ముగ్గురు యువకులు గంజాయి విక్రయాలకు పాల్పడుతూ శుక్రవారం మండలంలోని వంగపల్లి శివారు ఉప్పరోనిగడ్డలో సేవిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై షేక్ మహబూబ్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం... జనగామ జిల్లాలోని వడ్లకొండ గ్రామానికి చెందిన గడ్డం భువన్, నర్మెట్ట మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన ప్రణయ్‌కుమార్, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లకు చెందిన సోహెల్ కలిసి హైదరాబాద్ నుంచి గంజాయిని తెచ్చి పలువురికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉప్పరోనిగడ్డలో గంజాయి సేవిస్తుండగా, పక్కా సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 106 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

- పోక్సో కేసు నమోదు

జగదేవ్ పూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16)ను ప్రేమించాలని అదే గ్రామానికి చెందిన యువకుడు వెంటపడుతూ లైంగికంగా వేధించాడు. దీంతో ఆమె విషయాన్ని తన తల్లికి చెప్పింది. శుక్రవారం బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. నిందితుడిని సిద్దిపేట భరోసా కేంద్రానికి తరలించినట్లు వివరించారు.

సూసైడ్ స్పాట్‌గా మంజీర

- ఆరు వారాల్లో నదిలో దూకిన ముగ్గురు
- మృతదేహంగా ఒకరు.. ఆచూకీ దొరకని మరో ఇద్దరు
- వంతెన వద్ద రక్షణ చర్యలు కరువు
- పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు అధికారులు



శివంపేట సమీపంలో మంజీర నదిపై ఉన్న వంతెన

పుల్కల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట సమీపంలోని మంజీర నది వంతెన ఇటీవల సూసైడ్ స్పాట్‌గా మారింది. పోలీసులు, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, జీవితంపై విరక్తి వంటి కారణాల వల్ల కొందరు అభాగ్యులు ఈ వంతెన నుంచి మంజీర నదిలోకి దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కేవలం ఆరు వారాల వ్యవధిలోనే ముగ్గురు వ్యక్తులు నదిలో దూకి గల్లంతు కావడం స్థానికంగా కలకలం రేపింది.

ఉధృతంగా నది ప్రవాహం

గత రెండు నెలలుగా కురిసిన భారీ వర్షాలకు సింగూరు ప్రాజెక్టు, మంజీర రిజర్వాయర్‌లకు భారీగా వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో జలాశయాల గేట్లు ఎత్తడంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇదే సమయంలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై ఉన్న ఆరు వరుసల వంతెనపై నుంచి దూకి గల్లంతవడం ఆందోళన కలిగిస్తోంది. గల్లంతైన వారి ఆచూకీ లభించక, నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడి, బాధిత కుటుంబాలలో తీరని విషాదం నెలకొంటోంది.



రక్షణ చర్యలు కరువు

శివంపేట సమీపంలోని మంజీర నది వంతెన వద్ద కనీస రక్షణ చర్యలు కరువయ్యాయి. జాతీయ రహదారిపై ఉన్న ఈ వంతెనపై నుంచి నదిలోకి దూకకుండా ఉండటానికి, కిందకు దిగేందుకు అవకాశం లేకుండా రైలింగ్ గోడను పకడ్బందీగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వంతెన సూసైడ్ స్పాట్‌గా మారుతున్నా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, పోలీసులు దీనిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వంతెన వద్ద పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని లేదా, ఎవరూ రైలింగ్ గోడపైకి ఎక్కకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వరుస ఘటనలు



మంజీరలో దూకిన మల్లాగౌడ్, లోకచంద్ర, బుడ్డోళ్ల మల్లేశం(ఫైల్)

● మద్యానికి బానిసైన శివంపేట మండలానికి చెందిన బడంపేట మల్లాగౌడ్ ఆగస్టు 29న భార్యతో గొడవపడి మద్యం మత్తులో వంతెనపై నుంచి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 35 రోజుల తర్వాత అక్టోబరు 3న సంగారెడ్డి మండలం గౌడిచర్ల శివారులో కుళ్లిపోయిన అతని మృతదేహం లభ్యమైంది.

● జోగిపేటకు చెందిన క్లింకార యూట్యూబ్ ఛానల్ సీఈవో, రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన లోకచంద్ర, సెప్టెంబరు 30న మంజీర నది వంతెనపై నుంచి దూకి గల్లంతయ్యాడు. సంగారెడ్డిలోని ఓ లాడ్జిలో జరిగిన అనుమానాస్పద మృతి కేసులో రూరల్ ఎస్సై రవీందర్ తనను డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని భార్యకు ఆడియో రికార్డు పంపి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకచంద్ర గల్లంతై 12 రోజులవుతున్నా ఆచూకీ లభించలేదు.

● శివంపేట మండలానికి చెందిన బుడ్డోళ్ల మల్లేశం కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఒంటరిగా ఉంటూ జీవితంపై విరక్తి చెందడంతో ఈ నెల 8వ తేదీన నదిలో దూకి గల్లంతయ్యాడు. ముగ్గురు గల్లంతవగా, ఒక్క మల్లాగౌడ్ మృతదేహం మాత్రమే లభ్యం కావడంతో, లోకచంద్ర, మల్లేశం ఆచూకీ కనుక్కోవడం పోలీసులకు సవాలుగా మారింది. ఈ సంఘటనల దృశ్యాలు ఎన్‌హెచ్‌ఏఐ సీసీ కెమెరాల్లో రికార్డవుతున్నాయి.



మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

మంత్రి దృష్టికి నర్సాపూర్ నీటి సమస్య

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సాపూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం 'నర్సాపూర్‌కు నీటి గోస' శీర్షికన ప్రచురించిన కథనంపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి స్పందించారు. నియోజకవర్గంలోని గ్రామాలకు మంజీర నీటి సరఫరా ఆగిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలు సరఫరా చేసే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ కథనంలో పేర్కొన్నారు. దీనిపై రాజిరెడ్డి వెంటనే స్పందించి, శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌ను కలిసి ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంజీర నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందులను, ప్రత్యామ్నాయంగా గోదావరి జలాల పంపిణీకి ఉన్న అవకాశాలను మంత్రికి వివరించారు. సమస్యను వెంటనే పరిష్కరించి ప్రజల నీటి కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి వివేక్ సానుకూలంగా స్పందించి, వెంటనే ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేసినట్లు రాజిరెడ్డి తెలిపారు. మూడు, నాలుగు రోజులలో సమస్య పరిష్కరించి, గోదావరి జలాలను శివ్వంపేట సంపు వరకు సరఫరా చేసి, అక్కడి నుంచి గ్రామాలకు నీరు పంపిణీ అయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారని ఆయన వివరించారు. ఈ కథనం ద్వారా సమస్యను వెలుగులోకి తెచ్చి, పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి రాజిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ బాలికకు కేజీబీవీలో ఆశ్రయం



కాశీపూర్ కేజీబీవీలో భదావత్ మాలిని చేర్పిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు

కంది, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కంది మండలం వడ్డెన్నగూడెం తండా పరిధిలోని కొయ్యగుండు తండాకు చెందిన అనాథ గిరిజన బాలిక భదావత్ మాలినిని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు అక్కున చేర్చుకున్నారు. వడ్డెన్నగూడెం పాఠశాల ఉపాధ్యాయురాళ్లు జోత్స్న, పద్మావతి, విశ్రాంత మండల విద్యాధికారి, న్యాయవాది అంజయ్యలు ఈ బాలిక పరిస్థితిని జిల్లా అధికారులకు వివరించి, కేజీబీవీ లేదా ఏదైనా గురుకుల పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన జిల్లా అధికారులు శుక్రవారం కంది మండలంలోని కాశీపూర్ కేజీబీవీలో మాలినిని 6వ తరగతిలో చేర్పించారు. బాలికకు వసతి, దుస్తులు, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. తాను పెద్దయ్యాక డాక్టర్‌నై పేద ప్రజలకు సేవ చేస్తానని ఈ సందర్భంగా మాలిని చెప్పింది. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అధికారులు సునీత కన్నా, మాధవి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు శ్రావణ్ గౌడ్, సబితా, కంది మండల విద్యాధికారి జోగప్ప, కేజీబీవీ ప్రత్యేక అధికారి రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మునిపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం పోతిరెడ్డి జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మునిపల్లి మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలకు చెందిన విద్యార్థి అభినయ్ అండర్ 17 విభాగంలో 55 కిలోల వెయిట్ లిఫ్టింగ్‌లో మొదటి స్థానం సాధించాడు. అలాగే, వినయ్ 52 కిలోల విభాగంలో, వంశీ 45 కిలోల విభాగంలో ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించిన పీడీ స్వాతిని, విద్యార్థులను శుక్రవారం మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మల్లిక అభినందించారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

మెదక్ అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వెస్లీ పాఠశాల మైదానంలో అండర్-17 బాలబాలికలకు నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 18 మందితో కూడిన బాలురు, బాలికల జట్లను ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు వచ్చే నెల నవంబరు మొదటి వారంలో నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.. ఈ కార్యక్రమంలో పీడీలు శ్రీధర్‌రెడ్డి, నగేష్, శ్రీనివాసరావు, రూపేందర్, దేవేందర్‌రెడ్డి, శేఖర్. శిల్ప, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

స్థాయి మరినా.. సమస్యలు తీరలే

- గడ్డపోతారం.. మున్సిపాలిటీగా మారినా సమకూరని వసతులు
- అల్లీనగర్ తెలంగాణ కాలనీలో మురికి కూపాలుగా మారిన రోడ్లు
- కాజీపల్లి జీఎంఆర్ కాలనీలో దశాబ్ద కాలంగా తాగునీటి, రోడ్ల సమస్యలు
- పరిశ్రమలున్నా, ఆదాయం వచ్చినా కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం

జిన్నారం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంగా ఉండి, పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా జిన్నారం మండలం గడ్డపోతారంలో అభివృద్ధి మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. మున్సిపాలిటీగా ఏర్పాటయ్యి పది నెలలు గడిచినా, పురపాలక పరిధిలోని కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ వందకు పైగా పరిశ్రమలు, ఏటా మున్సిపాలిటీకి రూ.4 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నా, వందల కుటుంబాలు నివసించే కాలనీల్లో కనీస వసతుల కల్పనలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మురుగు కూపంగా తెలంగాణ కాలనీ

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అల్లీనగర్ గ్రామంలోని సర్వే నెం.27లో గల తెలంగాణ కాలనీ గత పదేళ్లుగా కనీస వసతులు లేక మురికి కూపంగా మారింది. ఇక్కడ సుమారు 200 నివాసాలు ఉండగా, కాలనీలోని రోడ్లు పూర్తిగా గోతులమయమై, పిచ్చిమొక్కలు, బురదతో నిండి నడవలేని స్థితికి చేరుకున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నివాసాల మధ్య నుంచే ప్రవహిస్తూ, రోడ్లపైకి చేరుతోంది. దీంతో కాలనీ అంతటా దుర్వాసన వెదజల్లుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసినా, నీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రక్షిత మంచినీరు అందడం లేదు. ఇక్కడ నాలుగు నివాసాల విషయంలో కోర్టు కేసు ఉన్నప్పటికీ, దానిని సాకుగా చూపి మొత్తం కాలనీ అభివృద్ధి పనులను నిలిపివేయడం గమనార్హం. తమ నివాసాలకు రక్షణ కోసమే కోర్టును ఆశ్రయిస్తే, కాలనీ మొత్తానికే అభివృద్ధి నిధులు ఆగిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గడ్డపోతారం మున్సిపాలిటీ తెలంగాణ కాలనీలో నివాసాల మధ్య కనీసం నడవలేని స్థితిలో రహదారి



కాజీపల్లి జీఏంఆర్ కాలనీలో మూడు నెలలుగా రోడ్డుపైనే డ్రైనేజీ ఏర్పాటు కోసం తెచ్చిన పైపులు, ఇటుకలు

తాగునీరు, రోడ్లు లేని జీఎంఆర్ కాలనీ

గడ్డపోతారంలో విలీనమైన కాజీపల్లి పంచాయతీ పరిధిలోని జీఎంఆర్ కాలనీలో కూడా ప్రజలు కనీస వసతులు లేక దశాబ్ద కాలంగా ఇక్కట్ల మధ్య జీవిస్తున్నారు. 2008లో 450 మందికి, 2023లో 47 మందికి ప్రభుత్వం ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వగా, వారు ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ కాలనీలో ప్రధాన రహదారి మినహా మిగిలిన అన్ని అంతర్గత రోడ్లు మట్టివే కాగా, అవి గుంతలమయంగా, మురుగు నీటి ప్రవాహాలతో నిండి ఉన్నాయి. తాగునీటి సమస్య ఇక్కడ తీవ్రంగా ఉంది. రెండేళ్ల క్రితం ఒక పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మించినా, నివాసాలకు పైప్‌లైన్, నల్లా కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. ఇక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం నాలుగు నెలల క్రితం రూ.15 లక్షలు మంజూరైనా, పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు కేవలం పైపులు, ఇటుకలు వేసి పనులు ప్రారంభించకపోవడంతో సమస్య మరింత జటిలమైంది. పారిశ్రామిక ప్రాంతం నుంచి మున్సిపాలిటీగా మారినా, ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే తమ కాలనీల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

పెళ్లైన నాలుగున్నర నెలలకే యువకుడి ఆత్మహత్య



విజయ్ కుమార్ (ఫైల్)

పాపన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లై నాలుగున్నర నెలలకే గిరిజన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి తండా శివారులో శుక్రవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొడిచన్‌పల్లి తండాకు చెందిన కేతావత్ విజయ్ కుమార్ (32) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసి కొంపల్లిలోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. నాలుగున్నర నెలల క్రితం కౌడిపల్లి మండలం బుజరంపేటకు చెందిన గీతతో అతనికి వివాహం జరిగింది. అయితే పెళ్లి తర్వాత అతను భార్యను ఇంటి వద్దే ఉంచి, తాను ఒక్కడే కొంపల్లిలో ఉంటున్నాడు. ఈ విషయంపై అతని అత్తింటివారు అక్కడ ఉద్యోగం మానేసి, స్థానికంగా ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులు, భార్యతో కలిసి ఉండాలని కోరారు. ఈ మేరకు కౌడిపల్లిలో పీటీఎం స్కానర్ల దుకాణంలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పనిని విజయ్‌కుమార్‌కు అప్పగించారు. కానీ ఈ పని ఇష్టం లేని ఆయన గురువారం ఉదయం పొడిచన్‌పల్లి తండా నుంచి బయటకు వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు, ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఏడుపాయలకు వెళ్లే దారిలో, పొడిచన్‌పల్లి తండా అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇక వైన్స్ టెండర్లకు సై

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు జరుగుతాయి. కొత్త వైన్‌షాపులు సైతం డిసెంబరు నెలలోనే ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో ఎలక్షన్ సీజన్ అంతా కూడా తమకు లాభిస్తుందనే ఆలోచనతో మద్యం షాపుల వైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే గ్రామపంచాయతీ, స్థానిక పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో మద్యం విక్రయాలు జోరుగా ఉంటాయి. అందుకే చాలామంది మనసు మద్యం షాపులపైకి మళ్లిందనే చర్చ జరుగుతోంది.

రూ.3 లక్షలైనా రెడీ..

కొత్త మద్యంషాపులకు సంబంధించి గత సెప్టెంబరు 26వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించడం ప్రారంభించారు. అప్పటి నుంచి నెమ్మదిగా దరఖాస్తులు రావడం మొదలైంది. గడిచిన 14 రోజుల్లో అంటే అక్టోబరు 9వ తేదీ వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని 243 వైన్‌షాపులకు 200 దరఖాస్తులు రాగా.. కేవలం శుక్రవారం రోజున 87 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉండడంతో వచ్చే సోమవారం, ఆ తర్వాత శుక్రవారం రోజున భారీగా దరఖాస్తులు వస్తాయని ఆబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొదట్లో రూ.3 లక్షలు అనగానే వెనక్కుతగ్గారని.. ఇప్పుడు సాహసిస్తున్నారని చెబుతున్నారు.



ఆ పోటీ నుంచి ఈ పోటీకి

ఎన్నికల బరిలో నిలవాలనుకున్న చాలామంది ఆశావహులు వైన్‌షాపుల బరిలో నిలుస్తున్నారు. రిజర్వేషన్లు ప్రకటించి నోటిఫికేషన్ కూడా విడుదల చేయడంతో పలువురు ఆర్థిక వనరులను సమకూర్చుకున్నారు. భూములు, స్థలాలు, బంగారం తాకట్టు పెట్టి, విక్రయించి నగదు చేతపట్టుకున్నారు. ఇప్పుడు ఎన్నికలు వాయిదా పడడంతో ఆ సొమ్మును వైన్‌షాపుల వైపు మళ్లించాలని చూస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే ఐదేళ్లలో సంపాదించే సొమ్ము కంటే ఒక్క వైన్‌షాపు దక్కితే వచ్చే నగదే ఎక్కువ అని భావిస్తున్నారు. రెండేళ్ల కిందట సిద్దిపేట జిల్లాలోని ఓ మద్యం షాపు దక్కిన వ్యక్తికి రూ.70 లక్షల నగదు ఇచ్చి మద్యం వ్యాపారులు స్వాధీనం చేసుకున్నారు. 20 శాతం వాటా కూడా ఇచ్చారు. ఇలాంటి జాక్‌పాట్ తాకితే తలరాత మారుతుందని లెక్కలు వేసుకుంటున్నారు.

బీసీ రిజర్వేషన్లపై విషం కక్కుతున్న విపక్షాలు

- డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



ఆంజనేయులు గౌడ్

మెదక్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలన్న డిమాండ్ జాతీయ స్థాయిలో మొదలు కావడం బీఆర్ఎస్, బీజేపీలను ఆందోళనకు గురి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయంగా చేపట్టిన కులగణన ఆధారంగా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ అమలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం బీసీ జనాభా ఎంతో స్పష్టత వచ్చిందని, అందుకు తగ్గట్టుగా రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వం భావించిందని వివరించారు. ఇప్పటికే దేశంలో పార్టీలన్నీ బీసీ జపం ఎత్తుకున్నాయని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో బీసీ అంశం ప్రధాన ఏ జెండా అవుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అడ్డుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రజలు తరిమికొట్టే రోజు వస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపిందని, కానీ గవర్నర్ న్యాయ సమీక్ష కోసం కేంద్ర హోం శాఖకు, అటు నుంచి రాష్ట్ర పతికి పంపగా ఇప్పటివరకూ ఏలాటి ఆదేశాలు రాలేదని వివరించారు. అసలు బీజేపీ రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో పెట్టి ఉంటే ఈ సమస్యే వచ్చి ఉండేది కాదన్నారు.

నైపుణ్యాభివృద్ధి దిశగా ప్రభుత్వ పాఠశాలలు

● విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి దిశగా ముందడుగు వేస్తున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో కేవీఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్యూటీ వెల్నెస్ మరియు అప్పారల్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్‌లో స్వయం ఉపాధికి సిద్ధం కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కొత్త రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ఎండి అజీబ్, సత్తయ్య, రాందాస్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామి, ఇన్‌స్ట్రక్టర్లు గౌతమి,స్వాతి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలపై చర్యలు తీసుకోవాలి

చేర్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని వినాయక మార్ట్‌లో ఎమ్మార్పీ కన్నా అధికధరల విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. నిత్యావసర సరుకులు, వస్తువులను ముద్రిత విలువకన్నా అధికంగా డబ్బులు వసూలుచేస్తున్నా అధికారులు పర్యవేక్షించకపోవడం తగదన్నారు. ఇతర మార్ట్‌లలోనూ ఇదే తతంగం కొనసాగుతుందని, వెంటనేతనిఖీలు చేపట్టి దోపిడీ నివారించాలని కోరారు.

గ్రాండ్‌గా మాస్టర్ ఓరాటర్ కాంటెస్ట్



విజేతలకు మెమోంటో, సర్టిఫికెట్స్ ప్రధానం చేస్తున్న పాఠశాల యాజమాన్యం

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో మాస్టర్ ఓరాటర్ కాంటెస్ట్ సీజన్ 6 గ్రాండ్ ఫైనల్ ఘనంగా నిర్వహించారు. నారాయణ విద్యా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రాండ్ ఈవెంట్‌కు కరీంనగర్ జోన్‌లోని నారాయణ ఆరు బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు తమ వాక్చాతుర్యం, ప్రజెంటేషన్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ప్రతిభావంతంగా ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి రాజప్రభాకర్ రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం మెరుగుపడుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. అంతకుముందు నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వేదికపై మాట్లాడే స్థాయిని పెంచడం, సామాజిక అవగాహనను పెంపొందించడం వంటి లక్ష్యాలతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటో, సర్టిఫికెట్ ప్రధానం చేశారు.

ప్రభుత్వ తప్పిదం వల్లనే ఎన్నికల వాయిదా

మిరుదొడ్డి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ల ను తప్పుదోవ పట్టించడం వల్లనే స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసిందని బీసీ సంఘం నాయకులు తుమ్మల బాల్‌రాజు, విద్యాసాగర్, భైరయ్య, జ్ఞానేశ్వర్‌లు అన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో బీసీ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం హైకోర్టులో తప్పుడు పిటీషన్ దాఖలు చేయడం ద్వారానే హైకోర్టు ఎన్నికలకు నాలుగువారాల గడుపు విధించిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రజలను తప్పుదారిపట్టిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహించడం పూర్తి విఫలమైందన్నారు. ఈసమావేంలో బీసీ సంఘం నాయకులు తదితరులున్నారు.

బండపల్లి పాఠశాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారు బండపల్లి కాలనీని మున్సిపల్ కమిషనర్ నాగేందర్ శుక్రవారం సందర్శించారు. కాలనీలోని డ్రైనేజ్ కాలువ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరంతా ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి ప్రవహిస్తు నిల్వ ఉంటుంది. దుర్గంధం వెదజల్లుతూ దోమలు స్వైరవిహారం చేస్తుండటం, నిత్యం విద్యార్థులు, ఉపాధ్యాయులు మురుగు నీటిలో నుంచి నడుచుకుంటూ ఇబ్బందులుపడుతున్న విషయమై 'బాబోయ్ ఇదేం కంపు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి కమీషనర్ నాగేందర్ స్పందించారు. కాలనీలో పర్యటించి పాఠశాల పరిసరాలు, డ్రైన్ కాలువ పరిస్థితులు పరిశీలిం చి ఇబ్బందులు అడిగితెలుసుకున్నారు. కాలనీవాసుల నిర్ణయానుసారం డ్రైన్ కాలువ పనులు చేపడతామని తెలిపారు. అంత కుముందు డ్రైన్ కాలువలోని సిల్ట్, చెత్తచెదారం తొలగింపచేశారు.

ఆర్టీసీ బస్సుల కోసం ఎస్ఎఫ్ఐ ధర్నా



అయినపూర్ గ్రామ ఎల్లమ్మ గుడి చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, సీపీఎం నాయకులు

కొమురవెల్లి,అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినపూర్ గ్రామం లోపటి వరకు జనగామ, హుస్నాబాద్ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు రావాలనీ డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఎల్లమ్మ గుడి చౌరస్తాలోని ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ ధర్నాకు సీపీఎం మండల నాయకుడు తేలు ఇస్తారి, తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. ప్రధానరహదారి ఎల్లమ్మ గుడి చౌరస్తాకు కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలోకి బస్సులు రాకపోవడమేమిటనీ ప్రశ్నించారు. ఇప్పటికైనా డిపో మేనేజర్లు గ్రామంలోకి బస్సులు వచ్చేలా చూడాలని లేకుంటే గ్రామస్థులను, విద్యార్థులను ఏకం చేసి పెద్దఎత్తున్న ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కర్రోళ్ల లెనిన్, చందు, భరత్, ఉల్లంపల్లి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో బాలమ్మ కృషి అభినందనీయం

ములుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ములుగు అభివృద్ధిలో మాజీ సర్పంచ్ చింతకింది బాలమ్మది కృషి ఉందని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జహంగీర్, భారాస రాష్ట్ర కార్యదర్శి జుబేర్ పాషా అన్నారు. ములుగు మాజీ సర్పంచ్ చింతకింది బాలమ్మ 16వ వర్ధంతి సందర్భంగా ములుగులోని ఆమె విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

● ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా చెత్తాచెదారం ● పిచ్చి మొక్కలతో నిండిపోయిన మురికి కాలువలు



దౌల్తాబాద్: గజ్వేల్‌కు వెళ్లే దారిలో చెత్త కుప్ప



దౌల్తాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో కాలువలో చెత్తకుప్ప

దౌల్తాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మురుగునీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మోరీల్లో చెత్తాచెదారం, నిండా నీరు చేరి దుర్వాసన వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో చెత్త చెదారంతో కుప్పలుగా ఉండడంతో విద్యార్థులు ముక్కు మూసుకొని వెళ్లవలసి వస్తుంది. గజ్వేల్ రోడ్, రామాయంపేట్ రోడ్, సిద్దిపేట రోడ్, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారంతో నిండిపోయింది. మురుగునీటి కాలువలు పిచ్చి మొక్కలతో కప్పి వేయబడ్డాయి. ఈ పరిస్థితి ఏదో ఒక కాలనీకే పరిమితం కాదు. చుట్టుపక్కల కాలనీలు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మురుగు కాలువల సమస్యను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన వారి నుంచి ఎటువంటి స్పందన రావడంలేదని స్థానికులు చెబుతున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో కొద్దిరోజుల నుంచి మురుగునీటి కాలువలు ముందుకు సాగడం లేదు. వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉంటే సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగు నీటి కాలువలను శుభ్రం చేసే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పల్లా పర్యటన

చేర్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం చేర్యాల పట్టణంలో పర్యటించారు. స్థానిక అంగడిబజారులో పర్యటించి అస్తవ్యస్తంగా పరిస్థితులపై ఆరా తీశారు. అతీగతీలేకుండా కొనసాగిస్తున్న మాంసం విక్రయ దుకాణాలను సరిచేయాలని, వ్యర్థాలను ఆరుబయట యథేచ్ఛానుసారం పారబోయకుండా చూడాలని కమిషనర్ నాగేందర్‌కు సూచించారు. భరత్ నగర్ కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావును పరామర్శించారు.

బీసీల రిజర్వేషన్ అడ్డుకోవడం సిగ్గుచేటు

సిద్దిపేట అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు సముచిత న్యాయం జరుగుతుంటే దానిని అడ్డుకోవడం సిగ్గుచేటని సిద్దిపేట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని మోడల్ బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బుట్టం గారి మాధవరెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బీసీలకు రావాల్సిన వాటా అడుగుతుంటే దానివల్ల మీకు వచ్చే నష్టం ఏమిటని, ఎన్నో ఏళ్లుగా బీసీలు వెనుకబాటుతనానికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కూడా చట్టబద్ధత కల్పించకుండా బీసీల మనోభావాలతో చెలగాటమాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీసీలు తగిన బుద్ధి చెపుతారన్నారు. బీజేపీ బీసీల పాలిట ద్రోహిగా మారిందని, బీసీ బిల్లును పెట్టకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో సిబ్బందితో కలిసి కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పరిశీలించారు. ఈ మేరకు పట్టణంలోని మైత్రివనం సంతోష్‌నగర్‌లో రోడ్డు సమస్యపై ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించారు. అనంతరం 38 వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వార్డులో శిథిలావస్థకు చేరిన గృహాలకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పార్వతి దేవాలయం వద్దనున్న మురికి కాలువపై స్లాబ్ నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 7వ వార్డులో పర్యటించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. మంగలికాలనీలో నీరు లీకేజీ కాగా, గమనించి వెంటనే మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు. గణపతి కుంట వద్ద రోడ్డు ఇతరత్ర సమస్యలపై వినతి పత్రాన్ని కాలనీ వాసులు కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, నాయకుడు ముత్యాల బుచ్చిరెడ్డి, ఏల్పుల స్వామి తదితరులు ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ములుగు/హుస్నాబాద్/మర్కుక్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గజ్వేల్ సీడీపీవో సరిత పేర్కొన్నారు. పోషక మాసం సందర్భంగా మర్కుక్ మండల పరిధిలోని కర్కపట్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గజ్వేల్ సీడీపీవో సరిత మండల విద్యాధికారి వెంకటరాములుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా నూనె చక్కెర ఉప్పు లేకుండా ఉండేలా చూసుకోవాలని ప్రస్తుత కాలంలో బీపీ షుగర్లతో బాధపడుతున్న వారి సంఖ్య అత్యధికంగా ఉంటుందని ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే మునగాకు ఆకుకూరలు వంటి వాటితో ఆరోగ్యం సమృద్ధిగా ఉంటుందని అనారోగ్యాల బారిన పడకుండా కూడా ఉంటామని వారు తెలిపారు. సమతుల ఆహారం తీసుకోవడానికి కావలసిన జాగ్రత్తలను మండల పరిధిలోని 16 గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన రకరకాల వంటకాలను తల్లిదండ్రులకు చేసి తినిపించి చూపించారు.

హుస్నాబాద్‌లో

ప్రతి మహిళ సమతుల ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని హుస్నాబాద్ సీడీపీవో జయప్రద సూచించారు. శుక్రవారం హుస్నాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు చక్కెర, నూనెల వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు అందించే ఆహారం, ప్రీ స్కూల్ విద్యపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత, మంచినీటి వినియోగం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ములుగులో

గ్రామాల్లోని పిల్లలకు, పెద్దలకు పోషణ లోపం లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ములుగు అంగన్‌వాడీ సీడీపీవో సరిత, పోషణాబీయాన్ గజ్వేల్ బ్లాక్ కో ఆర్డినేటర్ పి కిరణ్ తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు జరిగేనా

● వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
● పట్టించుకోని అధికారులు



ములుగు రాజీవ రహదారి నర్సంపల్లి రోడ్డుకు ప్రమాదకరంగా గుంత

ములుగు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు చెడిపోయి గుంతలుగా మారాయి. వాటిని పట్టించుకున్న అధికారులు కరువయ్యారు దాంతో వివాహనదారులకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ములుగు మండల పరిధిలోని పలు రహదారుల్లో వర్షాలకు రోడ్లన్నీ గుంతలుగా మారి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ములుగు మండలం నర్సంపల్లి. నుంచి అడవి మజీద్. కొట్టాల. కరకపట్ల. ఆలీ నగర్. వెళ్లేదారిలో రాజీవ్ రహదారి పక్కనే వర్షాలకు పెద్ద గుంత పడి నెలలు గడుస్తున్న పట్టించుకున్న అధికారులు కరువయ్యారు. అంతేకాకుండా మండల పరిధిలోని వంటిమామిడి చౌరస్తా నుంచి తనికి బొల్లారం. నర్సాపూర్. సింగన్నగూడ. కొత్తూరు. బండ మైలారం. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ వరకు పారిశ్రామిక వాడ ఉండడం వల్ల పెద్ద పెద్ద వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి కస్తూర్బా పాఠశాల సమీపంలో రోడ్డుపై గుంతలు పడ్డాయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతోపాటు నర్సాపూర్ గ్రామం మూలమలుపు వద్ద పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనికి కారణం సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే. జిల్లా రోడ్డు శాఖ అధికారులు స్పందించి పర్యవేక్షణ చేసి ఆ రోడ్లను మరమ్మతులు చేయించే విధంగా కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత

● ఎస్సై ప్రేమ్ దీప్

గజ్వేల్ రూరల్ అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని గజ్వేల్ ఎస్సై ప్రేమ్ దీప్ అన్నారు. గురువారం రాత్రి గజ్వేల్ మండలం కొమటిబండ గ్రామంలో సైబర్ నేరలపై, చట్టాలపై, డ్రగ్స్ గంజాయిపై ట్రాఫిక్ నిభందనలపై పోలీస్ బృందంచే కనువిప్పు కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రేమ్ దీప్ మాట్లాడుతూ.. నిర్మానుష్య ప్రదేశాలలో మహిళలు ఒంటరిగా తిరగవద్దని సూచించారు, ఈ మధ్యకాలంలో చైన్ స్నాచింగ్ దొంగతనాలు జరుగుతున్నాయి జాగ్రత్తగా ఉండాలి, గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా గ్రామాలలో సంచరిస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దని వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ ప్రజల సెన్సార్ సెక్యూరిటీ గురించి సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి గ్రామస్థులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు.

ఇదేమీ రోగం!

(5వ పేజీ తరువాయి)

సెంటర్లు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు జీతాలు ఇచ్చి ప్రత్యేక సిబ్బందిని ఆసుపత్రి ప్రాంగణంలోనే నియమించాయి. వీరు డాక్టర్లతో సమన్వయం చేసుకుని రోగులను తమ సెంటర్లకు తరలిస్తున్నారు. ఇక కొంతమంది సిబ్బంది పోస్టుమార్టంకు వచ్చే వారి నుంచి కూడా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సిబ్బంది నోటి దురుసు

ప్రభుత్వ ఆసుపత్రిలోని లేబర్ రూంలో సిబ్బంది, వైద్యుల మాటలు జుగుప్సాకరంగా ఉంటున్నాయని ప్రసూతి మహిళలు వాపోతున్నారు. అంతేకాకుండా, డ్యూటీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు కూడా సిబ్బంది పట్ల నోటి దురుసును ప్రదర్శిస్తున్నారని, నూతనంగా చేరిన స్టాఫ్ నర్సులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది.

పారిశుధ్య సిబ్బంది నియామకంలో అక్రమాలు

పారిశుధ్య సిబ్బంది నియామకాల విషయంలో ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పాత సిబ్బందిని అకారణంగా తొలగించి, కొత్త వారి నియామకానికి గాను రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని సమాచారం. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న ఈ పరిస్థితులపై వైద్య శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ తక్షణమే దృష్టి సారించి, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

గజ్వేల్ రూరల్ /సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవం సందర్భంగ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భాషాసంస్కృతిక విభాగం, జాతీయ సేవా పథకం మూడవ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. యూ అండ్ మీ సంస్థ ప్రతినిధి సైకాలజికల్ కౌన్సిలర్ రమాదేవి వక్తగా హజరై మాట్లాడారు. మనిషి ఎదుగుదలకు, వ్యక్తిత్వ నిర్మాణానికి మానసిక ఆరోగ్యమే ముఖ్యమని పేర్కొన్నారు. నేడు యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఒత్తిడి, ఒంటరితనం, సామాజిక మాధ్యామాల విపరీతప్రభావాలను అధిగమిస్తేనే జీవితనిర్మాణంలో కీలకమైన విద్యార్థిదశ విజయం సాధిస్తుందన్నారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేసిన జడ్జి రేవతి

హుస్నాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : డిజేబుల్ డే సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగుల పిల్లలకు మున్సిఫ్‌కోర్టు జడ్జి రేవతి పండ్లు పంపిణీ చేశారు. పిల్లలకు చదువు చక్కగా నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భవిత సెంటర్‌కు ఎలాంటి అవసరం ఉన్నా తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

పాఠశాలలో మిగిలింది ఒక్కడే టీచర్

రాయపోల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం తయారు చేస్తుంటే ఓ పాఠశాలలో మాత్రం పూర్వపు పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ వస్తున్నది. వివరాల్లోకి వెళితే రాయపోల్ మండలం రామారం ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు చదువుకునే అవకాశం ఉన్నది. ఈ పాఠశాలకు 4 ఉపాధ్యాయ పోస్టులు మంజూరీ ఉన్నాయి. అయితే ఒక పోస్టు ఖాళీ ఉండగా మూడు పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. అయినప్పటికీ విద్యా బోధనకు ఇబ్బంది కలగకుండా ఉన్న ఉపాధ్యాయులు నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు నెల క్రితం పదోన్నతిపై బదిలీ అయి వెళ్లాడు. మరో ఉపాధ్యాయురాలు నెల క్రితం మెటర్నటీ లీవ్‌లో వెళ్లింది. దీంతో ఐదు తరగతులకు మిగిలింది ఒక్కడే ఉపాధ్యాయుడు. అందరినీ ఓ గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధించాల్సి వస్తున్నది. ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు అనివార్య కారణాలతో సెలవు పెట్టాల్సి వస్తే పాఠశాల తాళం తీసేవారు కూడా ఉండరు. వెంటనే రామారం పాఠశాలలో ఉపాధ్యాయులను భర్తీ చే యాలని త ల్లిదండ్రులు కోరుతున్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమురవెల్లి/మద్దూరు,/చేర్యాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నేడు చేర్యాల, కొమురవెల్లి, ధూళిమిట్ట, మద్దూరు మండలా లలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిగ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని టీఎస్ఎస్‌పీడీసీఎల్ చేర్యాల ఏడీఈ వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎరువుల దుకాణ యజమానులు వర్సెస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

గజ్వేల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారని ఫర్టిలైజర్ దుకాణ దారులు ఆందోళన చేపట్టారు. ఓ బయో మందు విషయమై ఉదయం నుంచి స్టింగ్ ఆపరేషన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించినట్లు తెలుస్తుంది. ఈ మందు విషయంలో చివరకు పోలీసులు ఎరువుల దుకాణంలో పనిచేసే సిబ్బంది భరత్ అనే యువకుడిపై దాడి చేసినట్లు దుకాణదారులు, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వ్యవసాయాధికారి నాగరాజు తన సిబ్బందితో వచ్చి దుకాణాన్ని తనిఖీ చేశారు.

వృద్ధుడిపై కోతుల దాడి

మద్దూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు తుషాలపురం మల్లయ్యపై శుక్రవారం కోతులు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన మల్లయ్యను చికిత్స నిమిత్తం నంగునూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోతులను అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలిగా మంజుల

కొండపాక,అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ కొండపాక మండల అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు బండమీది మంజుల తిరుపతిని నియమించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి నియామక పత్రం శుక్రవారం అందచేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి , మంత్రులు వివేక్ వెంకటస్వామి , పొన్నం ప్రభాకర్ దామోదర్ రాజానర్సింహా, దుద్దిల్లా శ్రీధర్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు మైనం పల్లి హనుమంత్ రావులకు ధన్యవాదాలు తెలిపారు.

హుస్నాబాద్‌లో బంద్

హుస్నాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లపై అన్యాయం జరిగిందని బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం హుస్నాబాద్‌లో బంద్ నిర్వహించారు. హోటళ్లు, వర్తక, వ్యాపార సంస్థలు, వైన్స్ బంద్‌ను పాటించాయి. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇంచార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బీఎస్పీ నాయకులు వేల్పుల రాజు, రవీందర్, శ్రీను గౌడ్, మల్లేశం, విక్రమ్, హనుమంతు తదితరులున్నారు.

మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటు చేయాలి

హుస్నాబాద్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పత్తి, మొక్కజొన్న కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనట్లయితే పండించిన పంటను మధ్య దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతారన్నారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలో వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తూ రైతులను మోసాలకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్ రెడ్డి, నాయకులు సూరపంల్లి పరశురాములు, పుల్లూరి శ్యామ్, మేకల వికాస్ తదితరులున్నారు.

యువకుడి అదృశ్యం



రఘు(ఫైల్)

కుకునూరుపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కుకునూర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం .. కుకునూర్ పల్లి గ్రామానికి చెందిన చిన్న రాజి గారి రాజయ్య పెద్ద కుమారుడు అయిన రఘు(23) గత మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకి ఇంట్లో నుంచి బయటకి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. అతడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. రెండు రోజుల నుంచి చుట్టుపక్కల బంధువుల వద్ద వెతకినా ఆచూకీ దొరకలేదు. దీంతో శుక్రవారం తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి నిరసనలు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ మందకృష్ణ పిలుపుమేరకు 10 రోజులపాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సిద్దిపేటలోని బీజేఆర్ భవన్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ వీహెచ్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్ మాట్లాడుతూ దేశంలో దళితులపై జరిగిన దాడికి రాజ్యాంగంపై జరిగిన దాడిగా ప్రజాస్వామ్యంపై న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు.

ధాన్యం కొనగోళ్ల కేంద్రాలు ప్రారంభం

సిద్దిపేటరూరల్/జగదేవ్‌పూర్/దౌల్తాబాద్/మర్కుక్/సిద్దిపేటఅర్బన్/అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు మండలాల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని వ్యవసాయ అధికారులు అన్నారు.

వేతనాలను ఒకటో తారీఖునే చెల్లించాలి



గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గజ్వేల్, అక్టోబరు 10(ఆంధ్ర జ్యోతి): వేతనాలను ఒకటో తారీఖునే చెల్లించాలని గజ్వేల్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎమర్జేన్సీ విభాగం ఎదుట వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకుని నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత కొద్ది రోజులుగా తమ వేతనాలు ఆలస్యంగా వస్తున్నాయని, దీంతో నిత్యావసరాలకు, బ్యాంకులకు చెల్లించే ఈఎంఐల విషయంలో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కనీస అవసరాలకు డబ్బులు లేకపోవడంతో బాకీలు చేయాల్సి వస్తుందని, వెంటనే ప్రభుత్వం, వైద్య విధాన పరిషత్ స్పందించి ఒకటో తేదీనే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.